సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



పట్టుదల పదింతలు
పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా విద్యా శాఖ అడుగులు వేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేస్తోంది. -8లో..



దుఃఖం 'ఒక్కటే' మిగిలింది!
చిత్తూరు జిల్లా కుప్పం–పలమనేరు రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు విగతజీవులు కావడం తీవ్ర విషాదాన్ని నింపింది. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 265 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	638	642
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 291.66 కిలోలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ
అదే జోష్!

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పి.రామసుబ్బారెడ్డి ఏకగ్రీవం
- నేడు ధ్రువీకరణ పత్రం అందజేయనున్న అధికారులు
- గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ పట్టు బిగిస్తున్న వైఎస్సార్‌సీపీ
- ఒంటేరుకు టీడీపీ మద్దతు పలకడంతో ఓ వర్గం దూరం



సాక్షి ప్రతినిధి, కడప: ప్రజామద్దతుతో సాధారణ ఎన్నికల నుంచి విజయాల పరంపరను కొనసాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే ఊపు ప్రదర్శిస్తోంది. తాజాగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఏకగ్రీవంగా ఆ పార్టీ ఖాతాలో నమోదైంది. ఈమేరకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పి. రామసుబ్బారెడ్డి అధికారికంగా ధ్రువీకరణ పత్రం అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల్లో సైతం జిల్లాలో అదే స్థాయిలో పట్టు బిగిస్తోంది. ఆ పార్టీ నేతలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఓటర్లతో నేరుగా మమేకం అవుతున్నారు. వ్యూహ, ప్రతివ్యూహాలపై వైఎస్సార్‌సీపీ అగ్రనేతలు ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 911 మంది స్థానిక సంస్థల ప్రతినిధులుంటే వారిలో 94 శాతం వైఎస్సార్‌సీపీ సభ్యులే. రాజకీయ పరిశీలకులు సైతం ఈ ఎన్నిక ఏకగ్రీవం దిశగా పయనించే అవకాశం ఉందని భావించారు. ఇదే పరిస్థితిలో స్థానిక సంస్థల్లో అత్యధిక ఓట్లున్న వైఎస్సార్‌సీపీకి ఏకగ్రీవంగా కట్టబెట్టడమే సరైన నిర్ణయమని టీడీపీ సీనియర్ నేతలు భావించారు. కాగా 4శాతం ఓట్లున్నా సరే టీడీపీ నేతలు కొందరు పోటీగా నామినేషన్ దాఖలు చేయించారు. నామినేషన్‌ను బలపర్చేందుకు ఓటర్లు ముందుకు రాకపోవడంతో ఓటర్ల సంతకాలు ఫోర్జరీ చేశారు. అదే విషయాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టికి స్వయంగా ఓటర్లు తీసుకురావడంతో పరిశీలనలో టీడీపీ నేత రమణయ్య యాదవ్ నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పి.రామసుబ్బారెడ్డి వేసిన నామినేషన్ ఒక్కటి మాత్రమే నిలిచింది. ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు సోమవారం ధ్రువీకరించాల్సి ఉంది.

గ్రాడ్యుయేట్స్‌లో సైతం..




వెన్నపూస రవీంద్రారెడ్డి

పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అనేక మంది పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, పీడీఎఫ్ అభ్యర్థి నాగరాజు, టీడీపీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డిల మధ్య పోటీ నడుస్తున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్‌సీపీ స్పష్టమైన ఆధిక్యత ప్రదర్శిస్తుండడం, గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా యువతకు ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో వెన్నపూస రవీంద్రారెడ్డి విజయం అతి సునాయసం కానుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. దీంతోపాటు క్షేత్రస్థాయిలో ఓటింగ్ చేయించుకునే కేడర్ కూడా ఉండడం వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి బాగా కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. దీంతో టీడీపీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డి, పీడీఎఫ్ అభ్యర్థి నాగరాజులను రెండు, మూడు స్థానాల్లోకి నెట్టేయడం ఖాయమనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. నానాటికీ టీడీపీ పోటీ కూడా ఇవ్వలేని పరిస్థితికి దిగజారిపోతున్నట్లు సమాచారం. మొత్తానికి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ దూకుడుగా ముందుకు వెళుతోందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో..

స్థానిక సంస్థల ఎమ్మెల్సీని కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాలు సాధించుకునేందుకు విశేషంగా కృషి చేస్తోంది. ఆ మేరకు జిల్లా నుంచి విస్తృతంగా మద్దతు సమీకరించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు, సమీక్షలు నిర్వహిస్తోంది. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ప్రధాన పోటీదారులంతా జిల్లా వాసులు కావడంతో మరింత కీలకంగా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంవీ రామచంద్రారెడ్డి, పీడీఎఫ్ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి, ఏపీటీఎఫ్, ఆర్‌జేయూపీ, తదితర సంఘాలు, తెలుగుదేశం పార్టీ మద్దతుతో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ నుంచి నారాయణరెడ్డి పోటీ చేస్తున్నారు. వీరంతా ఎవరి స్థాయిలో వారు ఉపాధ్యాయుల మద్దతు కోరుతున్నారు.

టీడీపీ మద్దతు ఇవ్వడంతో...
టీచర్స్ ఎమ్మెల్సీగా గతంలో పోటీ చేసి ఓటమి చవిచూసిన ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మరోమారు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఉపాధ్యాయ సంఘాలతో మమేకమై ప్రచారం చేసుకుంటున్న ఆయనకు తెలుగుదేశం పార్టీ మద్దతు ప్రకటించింది. దాంతో ఓ వర్గం పూర్తిగా దూరమైంది. అప్పటి వరకూ పోటీదారుడుగా ఉన్న ఆయన ఒక్కమారుగా వెనుకంజలో పడ్డట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మరోవైపు ఉద్యమనేతకు ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాలని పలు సంఘాలు కోరుతున్నాయి. ఉద్యమనేత కత్తి నరసింహారెడ్డికి ఇదివరకే అవకాశం ఇచ్చిన నేపథ్యంలో మరోమారు ఆయనకు ఛాన్సు ఇచ్చేందుకు విముఖత చూపుతున్నారనే అభిప్రాయాన్ని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. వెరసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డికి అనూహ్య మద్దతు లభిస్తోంది. వైఎస్సార్‌సీపీకి పుట్టినిల్లు అయిన జిల్లాలో ఆయనకు ఉపాధ్యాయ వర్గాల నుంచి విశేష ఆదరణ లభిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి ప్రజాప్రతినిధులు సైతం సహకారం అందిస్తుండడంతో జిల్లాలో భారీ స్థాయిలో టీచర్లు అండగా నిలుస్తున్నారని పలువురు వివరిస్తున్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థులను
భారీ మెజార్టీతో గెలిపించాలి



శిల్పారామంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు, వేదికపై డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న ఎంవీ రామచంద్రారెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె. సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక శిల్పారామంలో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డితో కలిసి 36 ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు పాఠశాలల సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉపాధ్యాయులంతా సమష్టిగా ఎంవీ రామచంద్రారెడ్డికి మద్దతు పలకాలని కోరారు. అలాగే కడప అపూర్వ కల్యాణ మండపంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నర ఏళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి పార్టీ నాయకులు అంకిత భావంతో కృషి చేయాలన్నారు.అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పోటీ చేస్తున్న తనకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, ఎలియాస్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు సూర్యనారాయణరావు, షఫీ, రామలక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ , అహ్మద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. అపూర్వ కల్యాణమండపంలో జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రాము, ప్రసాద్‌రెడ్డి, కిరణ్, జగన్ పాల్గొన్నారు.



అపూర్వ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లో సోమవారం స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. రాయచోటి కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా కార్యక్రమం జరుగుతుందని అన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రావాలని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా భారత ఎన్నికల సంఘం అనుమతి మేరకు స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎం కృష్ణయ్య

రాయచోటి: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లావ్యాప్తంగా ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అన్నమయ్య జిల్లా పరిధిలో ప్రాక్టికల్ పరీక్షలకు 7879 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎం కృష్ణయ్య తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 70 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తొలి రోజున ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలను నిర్వహించామన్నారు. ఈ పరీక్షలను మార్చి నెల 7వ తేదీ వరకు రెండు దశల్లో జరుగుతాయన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలు రైళ్ల గడువు పొడిగింపు



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మీదుగా నడిచే పలు రైళ్ల గడువును పొడిగించినట్లు కడప రైల్వేస్టేషన్ మేనేజర్ నరసింహారెడ్డి, కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా తెలిపారు.

- షోలాపూర్–తిరుపతి–షోలాపూర్ (01 4 37/38) మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలును జూన్ 30 వరకు పొడిగించారు.
- చెన్నై–శివమొగ్గ (06223/24)ల మధ్య నడిచే రైలును మార్చి 28వ తేది వరకు పొడిగించారన్నారు. ప్రతి మంగళ, ఆదివారాల్లో శివమొగ్గలో బయలుదేరి కడపకు తెల్లవారుజామున ఉదయం 5.58 గంటలకు చేరుతుందన్నారు. చెన్నైకి 11.10 గంటలకు చేరుతుందని వివరించారు. ప్రతి సోమ, బుధ వారాల్లో ఈ రైలు చెన్నైలో మధ్యాహ్నం 3.50 గంటలకు బయలుదేరి కడపకు రాత్రి 8.03 గంటలకు చేరుకుంటుందన్నారు.
- తిరుపతి–జాల్నా (07413/14)ల మధ్య నడిచే రైలు ప్రతి మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు తిరుపతిలో బయలుదేరుతుందన్నారు. కడపకు రాత్రి 8.38 గంటలకు చేరుకుని మరుసటిరోజు సాయంత్రం జాల్నాకు చేరుతుందన్నారు. ఈ రైలు ప్రతి ఆదివారం ఉదయం 11.50 గంటలకు జాల్నాలో బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 5.38 గంటలకు కడపకు చేరుకుని తిరుపతికి 9.05 గంటలకు చేరుతుందన్నారు. ఈ రైలు జూన్ 4వ తేది వరకు పొడిగించారు.
- అహ్మదాబాద్–తిరుచునాపల్లి (09419/ 20) మధ్య నడుస్తున్న రైలు మార్చి 30వ తేదీ వరకు పొడిగించారు. ఈ రైలు అహ్మదాబాద్‌లో ప్రతి గురువారం ఉదయం 9.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.58 గంటలకు కడపకు చేరుతుందన్నారు. తిరుచునాపల్లిలో ప్రతి ఆదివారం తెల్లవారుజామున 5.45 గంటలకు బయలుదేరి రాత్రి 8.25 గంటలకు కడపకు చేరుతుందన్నారు. ఈ రైలును ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించారన్నారు.
- హైదరాబాదు–తిరుపతి (07643/ 44)మధ్య నడిచే ప్రత్యేక రైలు ప్రతి సోమవారం రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 5.00 గంటలకు కడపకు చేరుకుని 10.00 గంటలకు తిరుపతి చేరుతుందన్నారు. ఈ రైలు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటలకు తిరుపతిలో బయలుదేరి సాయంత్రం 5.03 గంటలకు కడపకు చేరుతుందన్నారు. మే 29వ తేదీ వరకు ఈ రైలును పొడిగించారన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు..ఓటర్ల లెక్క తేలింది.!

- పట్టభద్రుల ఓటర్లు 44,423
- ఉపాధ్యాయ ఓటర్లు 3,890




రాజంపేట: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల లెక్క తేలింది.ఓటర్ల తుది జాబితా ఖరారైంది. ఓటర్లుగా దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. దీంతో ఫిబ్రవరి 23 తేదీ నాటికి నమోదైన ఓటర్లను పరిశీలించిన తర్వాత అధికారులు తుదిజాబితాను ప్రచురించారు. దీని ప్రకారం అన్నమయ్య జిల్లాలో పట్టభద్రులకు 50, ఉపాధ్యాయులకు 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారవర్గాల సమాచారం.

పురుష ఓటర్లే అధికం..
ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. అధికారులు విడుదల చేసిన జాబితా ప్రకారం పట్టభద్రుల ఎన్నికలకు 44,432 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 29,504, మంది, మహిళలు 14,919 మంది , ఇతరులు 9 మంది ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 3,890 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 2,506, మహిళలు 1,384 మంది ఉన్నారు. ఇందులోను పురుషుల ఓటర్లే అధికంగా ఉన్నారు.

అన్నమయ్య జిల్లా..క్షేత్రాల ఖిల్లా

- పదుల సంఖ్యలో పర్యాటక ప్రాంతాలు
- అద్భుతమైన ఆలయాలు
- హార్సిలిహిల్స్, గుర్రకొండ, సిద్దవటం కోట తదితర చారిత్రక ప్రదేశాలు



హార్సిలీ హిల్స్‌లోని అందమైన ప్రాంతం

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా పర్యాటక ప్రాంతాల ఖిల్లాగా మారింది. అద్భుతమైన విడిది ప్రదేశాలు, అందమైన కొండ కోనల మధ్య ఉన్న ఆలయాలు ఆకట్టుకుంటున్నాయి. చారిత్రక కట్టడాలుగల కోటలు జిల్లా సొంతం. ప్రసిద్ధి చెందిన అనేక ఆలయాలు కూడా జిల్లాలో అలరారుతున్నాయి. పవిత్ర నదులుగా గుర్తింపు పొందిన మాండవ్య, బాహుదా, చెయ్యేరు, పెన్నా నదులు ప్రవహిస్తుండగా..వాటి ఒడ్డున అనేక దేవాలయాలు భక్తుల పూజలందుకుంటున్నాయి. ప్రతినిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అన్నమయ్య జిల్లాలోని ఆలయాలకు వచ్చి వెళుతుండడం విశేషం.

భక్తుల కొంగు బంగారంగా పవిత్ర పుణ్యక్షేత్రాలు
జిల్లాలో చారిత్రాత్మక ప్రాశస్త్యం కలిగిన అనేక పుణ్యక్షేత్రాలు కొలువుదీరాయి. ప్రధానంగా రాయచోటి వీరభద్రస్వామి ఆలయం, నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం, అత్తిరాల శ్రీ త్రేతేశ్వరస్వామి ఆలయం, తాళ్లపాక అన్నమయ్య, తంబళ్లపల్లెలోని మల్లెయ్యకొండ, తరిగొండ లక్ష్మి నరసింహాస్వామి, రెడ్డెమ్మ కోన, వాల్మీకిపురం కోదండ రామాలయం, లక్కిరెడ్డిపల్లె అనంతపురం గంగమ్మ ఆలయం, మదనపల్లె శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి, రైల్వేకోడూరు పరిధిలోని గుండాల కోన, సిద్దవట మండల పరిధిలోని శ్రీ నిత్యపూజస్వామి ఆలయం తదితర క్షేత్రాలు భక్తులకు కొంగుబంగారంగా వెలుగొందుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజు భక్తులు ఆయా క్షేత్రాలకు వచ్చి స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకుంటున్నారు.



అత్తిరాలలోని త్రేతేశ్వరస్వామి ఆలయం

అటువైపు బౌద్ధారామాలు.... ఇటువైపు గుర్రంకొండ
జిల్లాలో చరిత్రకు కొదవ లేదు. చారిత్రాత్మక కట్టడాలకు పెట్టింది పేరు. నందలూరు మండల పరిధిలోని అడపూరులో సహజ సిద్ధంగా ఏర్పడిన బౌద్ధారామాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అంతేకాకుండా చరిత్రలో గొప్పగా చెప్పుకునేలా సిద్దవటం, గుర్రంకొండలోని రాజుల కాలం నాటి కోటలు చరిత్రకెక్కాయి. అద్భుతమైన కట్టడాలకు ఆ కాలం నాటి కోట గోడలు నేటికీ చెక్కుచెదరని వైనం అబ్బురపరిచే అంశం. అన్నమయ్య జిల్లాలో రూపుదిద్దుకున్న వెలిగల్లు ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. పర్యాటకుల తాకిడి నేపథ్యంలో మరింత అభివృద్ధి చేసేందుకు బోటింగ్‌తోపాటు పార్కుల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

వేసవి విడిది హార్సిలీ హిల్స్
జిల్లాలో ఉన్న హార్సిలీహిల్స్ పేరు వినగానే వేసవి విడిదిగా చెప్పుకుంటారు. తెలంగాణ, ఏపీతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అనేక మంది వేసవిలో విడిది చేస్తారు. వందేళ్ల కిందట బ్రిటీషు కాలంలో నిర్మించిన భవనాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. వేసవిలోనూ చల్లని ఆహ్లాదాన్ని పంచుతుండడంతో ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వేసవివిడిది కోసం పర్యాటకులు వస్తుంటారు. రాజంపేట ఫారెస్టు పరిధిలోని జంగిల్ సఫారీ, రెడ్‌వుడ్ ప్రాంతాలను అటవీశాఖ అందుబాటులోకి తెస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు చెబుతున్నారు.



పచ్చదనంతో అన్నమయ్య జిల్లాలోని అటవీ ప్రాంతం



వెలిగల్లు ప్రాజెక్టు ప్రాంతం



గుర్రంకొండ కోటలోని రాణి మహల్

క్లుప్తంగా

గాయపడ్డ కార్మికుడి మృతి

మదనపల్లె : మండలంలోని సీటీఎం శ్రీనివాస కల్యాణ మండపం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు శనివారం రాత్రి మృతి చెందాడు. పట్టణంలోని గొల్లపల్లె దళితవాడకు చెందిన సురేష్‌బాబు(36) భవన నిర్మాణ కార్మికుడిగా జీవనం సాగిస్తుండే వాడు. ఆయన ఈ నెల 21న సీటీఎం నుంచి ద్విచక్రవాహనంలో వస్తుండగా.. మదనపల్లె నుంచి కలకడకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్ర గాయాల పాలయ్యాడు. అటుగా వెళుతున్న ప్రయాణికులు గుర్తించి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం చెన్నై ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్నా.. పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మరణించాడు. ఆయనకు భార్య సుశీల, మూడో తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు.

రిటైర్డ్ ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారి ఇంట్లో చోరీ

మదనపల్లె : రిటైర్డ్ ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. తాలూకా పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ సమీపంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి బాలకృష్ణారెడ్డి ఇటీవల వైద్య పరీక్షల నిమిత్తం బెంగళూరుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తలుపుల బద్దలు కొట్టి ఆ ఇంట్లోకి చొరబడ్డారు. నగలు, నగదు అపహరించారు. ఆదివారం ఇంటి తలుపులు తెరచి ఉండటంతో స్థానికులు గమనించి తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. అయితే ఇంటి యజమాని బాలకృష్ణారెడ్డి లేకపోవడంతో ఎంత చోరీ జరిగిందన్న విషయం తెలియరాలేదు. సోమవారం బాధితులు వచ్చిన తర్వాత తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. దుండగులు ఆధారాలు లభించకుండా ఇంటి చుట్టూ, ఇంట్లో కారంపొడి వేశారని, క్లూస్ టీం ద్వారా తనిఖీలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

బద్వేలు అర్బన్ : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం తెల్లవారుజామున లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోరుమామిళ్ళ రోడ్డు సమీపంలో మాడిశెట్టి వెంకటసుబ్బయ్య నివసిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా కృష్ణపట్నం నుంచి తాడిపత్రికి బొగ్గులోడుతో వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన లారీని అర్బన్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదు.

పట్టుదల పదింతలు

- పదో తరగతి పరీక్షలకు ప్రత్యేక ప్రణాళిక
- కార్యాచరణే కీలకం
- ఉత్తమ ఫలితాలు విద్యార్థుల చేతుల్లోనే
- ఇక మిగిలింది 36 రోజులే

జిల్లా సమాచారం	
పాఠశాలలు	485
పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు	22,395
బాలురు	11,249
బాలికలు	11,146
పరీక్షా కేంద్రాలు	492


స్టడీ అవర్స్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

మదనపల్లె సిటీ : పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా మార్గదర్శకాలను రూపొందించింది. ఈ మేరకు విద్యార్థులను సమాయత్తం చేయాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేసింది. సవరించిన సిలబస్ ప్రకారం ఆరు పేపర్ల విధానంపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించింది. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పది పబ్లిక్ పరీక్షల్లో 11 పేపర్లను కరోనా కారణంగా గత ఏడాది ఏడు పేపర్లకు కుదించగా, ఈ ఏడాది వాటిని ఆరు పేపర్లు చేశారు. బిట్ పేపర్ లేకుండా మొత్తం ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంది. ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. ఈ ఏడాది అన్నమయ్య జిల్లాలో 22,395 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ నేపథ్యంలో ఎలా సన్నద్ధం కావాలో సబ్జెక్టు నిపుణులు సూచిస్తున్నారు.

సమయం కీలకం

- మరో 36 రోజుల్లో పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సమయం చాలా కీలకం.
- రోజుకు ఏడు గంటల చొప్పున చదవాలి. ప్రణాళిక సిద్ధం చేసుకుంటే సీ,డీ గ్రేడుల్లోని విద్యార్థులు ఉత్తీర్ణత, ఏ, బీ గ్రేడుల్లోని వారు ఆశించిన మేరకు మార్కులు సాధించే అవకాశం ఉంటుంది' అని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు.

భౌతికశాస్త్రం భయానకం కాదు



భౌతిక, రసాయన శాస్త్రం కలిపి 50 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. భౌతికశాస్త్రంలో కాంతి, విద్యుత్ యూనిట్లు, సూత్రాల ఉత్పాదన, గణన, నిత్యజీవిత వినియోగం, భేదాలపై దృష్టి పెట్టాలి. రసాయనశాస్త్రంలో సమీకరణాలు, పరమాణు నిర్మాణం, లోహ సంగ్రహణ శాస్త్రం, మూలకాల వర్గీకరణ, ఆమ్లాలు, క్షారాలు యూనిట్లపై పట్టు సాధించాలి. శాస్త్రవేత్తల విశేషాలను గుర్తుంచుకోవాలి. ప్రయోగాలు, డయాగ్రమ్స్‌పై దృష్టి సారించాలి.

- వరప్రసాద్, ఎస్‌ఏ(పీఎస్), జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

మ్యాప్‌లతో ఉత్తమ గ్రేడింగ్



సోషియల్‌లో పట్టికలు, గ్రాఫ్‌లు, మ్యాప్ పాయింటింగ్, సమాచార విశ్లేషణ సాధన చేయాలి. 1-12 ప్రశ్నల వరకు ఒక్క మాటతో సమాధానం రాసేవి ఉంటాయి. 13 నుంచి 20 వరకు రెండు మార్కుల ప్రశ్నలు, 21-28 వరకు నాలుగు మార్కుల ప్రశ్నలు ఉంటాయి. 29-33 వరకు ఇంటర్నల్ చాయిస్ ఉంది. మ్యాప్ పాయింటింగ్‌లో పాఠ్యాంశం చివర ఉన్న ప్రశ్నలను యథాతథంగా ఇవ్వకుండా విద్యా ప్రమాణాలను పరీక్షించేలా ఇస్తారు.

- ఎం.నారాయణ, ఎస్‌ఏ (సోషియల్), జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

సాధన చేస్తే లెక్క తప్పదు



గణితం సాధన చేయాలి. 1, 2, 4 మార్కుల ప్రశ్నలకు చాయిస్ లేదు. 8 మార్కుల ప్రశ్నలకు మాత్రమే చాయిస్ ఉంటుంది. ఒక మార్కు ప్రశ్నలపై దృష్టి సారిస్తే ఏ,బీ గ్రేడ్ విద్యార్థులు 95కు పైగా మార్కులు సాధిస్తారు. సీ,డీ గ్రేడ్ విద్యార్థులు గ్రాఫ్‌లు, నిర్మాణాలు, పటాలపై దృష్టి సారిస్తే కనీసం 15 మార్కులు తెచ్చుకోవచ్చు. సమితులు, సంభావిత, సాంఖ్యకశాస్త్రం, త్రికోణమితి, వాస్తవ సంఖ్యలు శ్రద్ధగా చదివితే సీ,డీ గ్రేడ్ విద్యార్థులు ఉత్తీర్ణత పొందుతారు. ప్రశ్నపత్రం మొత్తం 33 ప్రశ్నలుంటాయి. సూత్రాలపై పట్టు సాధిస్తే గణితమంత సులువైన సబ్జెక్టు మరొకటి ఉండదు.

- మోహన్, ఎస్‌ఏ (గణితం), హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, మదనపల్లె

విశ్లేషణాత్మకంగా రాయాలి



తెలుగులో రామాయణంపై అవగాహన కలిగి ఉండాలి. సంఘటనలను క్రమంగా అమర్చగలగాలి. కంఠస్థం చేయకుండా చదివి ఆలోచించాలి. సృజనాత్మకత వల్ల ఉత్తమ మార్కులు పొందవచ్చు. పాఠ్యాంశంలోని స్టార్ గుర్తున్న పద్యాలను ఎక్కువ సార్లు రాసి సాధన చేయాలి. చక్కని చేతిరాత, వ్యాకరణంపై పట్టు సాధించాలి. లేఖా ప్రక్రియ సాధన చేస్తే సులభంగా మార్కులు సంపాదించవచ్చు. సమాసాలు, సంధులు, అలంకారాలు, వాక్యాల్లో రకాలపై పట్టు సాధించాలి. అవగాహన- ప్రతిస్పందనలో 32, భాషాంశాల్లో 32, వ్యక్తీకరణ, సృజనాత్మకతకు 36 మార్కులు ఉంటాయి.

- కె.రమేష్‌బాబు, ఎస్‌ఏ, (తెలుగు), జెడ్పీహెచ్ఎస్, నిమ్మనపల్లె

జీవశాస్త్రాన్ని ఇష్టంగా చదవాలి



ఈ ఏడాది పీఎస్, బయాలజీ ఒకే పేపరు ఉంటుంది. పార్ట్-ఏ పీఎస్ 50, పార్ట్-బీ బయాలజీ 50 మార్కులకు ఉంటుంది. 17 నుంచి 33 ప్రశ్న వరకు బయాలజీ ప్రశ్నలుంటాయి. ప్రయోగాలు, భేదాలు, చిత్రపటాలు, టేబుల్స్‌పై అవగాహన ఉండాలి. ఏదైనా ఒక విషయాన్ని విశ్లేషణ చేసేలా, రెండు విషయాలను పోలుస్తూ భేదాలను రాయాలంటూ ఒక ప్రశ్న కచ్చితంగా వస్తుంది. పాఠ్యాంశంపై, శాస్త్రవేత్తల పరిశోధనలపై పట్టు సాధించేలా అభ్యసనం చేయాలి. సమాధానాలు పాయింట్ల రూపంలో రాస్తే మంచిది.

- ఏ.ఫణీంద్ర, ఎస్‌ఏ(బయాలజీ), జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

ఉత్తీర్ణతలో రాజసం



హిందీలో ఉత్తీర్ణతకు 20 మార్కులే ఉండటంతో భాషపై కొంత అవగాహన ఉంటే పాస్ కావొచ్చు. చదవడం, రాయడం, బాగా సాధన చేయాలి. రోజూ అరగంట హిందీకి కేటాయిస్తే 80 శాతం మార్కులు సాధించవచ్చు. గ్రామర్ ఉన్న 1-12 ప్రశ్నలు (థింకింగ్ స్కిల్స్) పాఠానికి మినిమమ్ ఐదు ప్రాక్టీస్ చేయాలి. రోమన్-2 పద్యం నుంచి ఒకటి, గద్యం నుంచి మూడు పాసేజ్‌లు ఇస్తారు. అవగాహన చేసుకుని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. రోమన్-3 పద్యం నుంచి కవి పరిచయం, గద్యం నుంచి రచయిత పరిచయం రాయాలి. రోమన్-4లో ఎనిమిది షార్ట్ సమాధాన ప్రశ్నలుంటాయి. రోమన్-5 నుంచి చాయిస్ ఇస్తారు. పద్యాల నుంచి రెండు ఇస్తే ఒకటి, గద్యం నుంచి ఇస్తే ఒకటి రాయాలి. రోమన్-6లో చాయిస్ ఉంటుంది.

- ఏ.వసుధ, ఎస్‌ఏ(హిందీ), జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

ఆంగ్లంలో గ్రామర్ కీలకం



ఇంగ్లిష్ ప్రశ్నపత్రంలో మూడు సెక్షన్లలో 1-35 వరకు ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్ -ఏలో మూడు పాసేజ్‌లు పాఠ్యాంశం నుంచి 15 ప్రశ్నలు ఇస్తారు. వీటికి 30 మార్కులు వస్తాయి. పాఠ్య పుస్తకంపై అవగాహనతో 30 మార్కులు సులభంగా సాధించవచ్చు. సెక్షన్ -బిలో 16వ ప్రశ్న నుంచి 32వ ప్రశ్న వరకు 17 ప్రశ్నలు 40 మార్కులకు ఇస్తారు. పాఠ్యపుస్తకం లోని గ్రామర్, ఒకాబ్లరీ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రతి పాఠ్యాంశం వెనుక ఉన్న గ్రామర్, ఒకాబ్లరీ చదవడం ద్వారా 40 మార్కులు సాధించే వీలుంది. సెక్షన్ -సిలో 33-35 వరకు ఇచ్చే ప్రశ్నలతో విద్యార్థుల్లోని క్రియేటివ్ స్కిల్స్‌ను పరీక్షిస్తారు. లెటర్ రైటింగ్, ఎడిటర్ లెటర్, బ్రయోగ్రాఫికల్ స్కెచ్, ఇచ్చిన గ్రాఫ్ లేదా చార్ట్‌కి పేరాగ్రాఫ్ రాయడం చేయాలి. వీటిపై పట్టు సాధిస్తే 30 మార్కులు సాధించే వీలుంది.

- పి.మహమ్మద్‌ఖాన్, ఎస్‌ఏ(ఇంగ్లిష్) జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

మామిడి చెట్ల నరికివేత

ముళ్లకుసాలు ధ్వంసం


నరికివేతకు గురైన మామిడి చెట్లు

కేవీపల్లె : మండలంలోని వడ్లకుంట పంచాయతీ శిబ్బాలవారిపల్లెకు చెందిన రైతు ఆనందరెడ్డి తోటలో గుర్తుతెలియని వ్యక్తులు మామిడి చెట్లు నరికివేసి, ముళ్ల కుసాలను ధ్వంసం చేశారు. వివరాలిలా వున్నాయి. ఆనందరెడ్డి 20 ఎకరాల్లో మామిడి చెట్లు పెంచి, చుట్టూ ముళ్ల కుసాలతో కంచె ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వక్తులు ముళ్ల కుసాలు ధ్వంసం చేశారు. అలాగే రెండేళ్ల వయసు గల మామిడి చెట్లు నరికివేశారు. ఆదివారం ఉదయం గమనించిన రైతు ఆనందరెడ్డి కేవీపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 350 ముళ్ల కుసాలు ధ్వంసమయ్యాయని, 300 మామిడి చెట్లు నరికివేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నాటు తుపాకీ స్వాధీనం

వ్యక్తి అరెస్ట్

చిట్వేలి : మండలంలోని చిన్నరాచపల్లిలో ఏదోటి వెంకటసుబ్బయ్య(74)ను శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకుని, అతని నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. రైల్వేకోడూరు సీఐ విశ్వనాథరెడ్డి ఆదివారం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నరాచపల్లిలో పోలీసులు దాడులు నిర్వహించి, వెంకటసుబ్బయ్య నుంచి సింగిల్ బారెట్ నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఆయనను అరెస్ట్ చేశారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ కాటమయ్య, కానిస్టేబుల్ రెడ్డయ్య పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

మదనపల్లె : ఇద్దరిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్‌ఐ సుధాకర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వలసపల్లెకు చెందిన జయంతికి 16 ఏళ్ల క్రితం హైదరాబాదుకు చెందిన గురుప్రసాద్‌తో వివాహమైంది. వివాహ సమయంలో కుటుంబ సభ్యులు రూ.10 లక్షలు కట్నం ఇచ్చారు. అయితే కొంత కాలంగా అదనంగా మరో రూ.5 లక్షలు తేవాలని వేధింపులకు గురి చేస్తుండటంతో బాధితురాలు ఇటీవల పుట్టింటికి వచ్చింది. ఆమె తాలూకా పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బాధితురాలు భర్త గురుప్రసాద్, అతని చెల్లెలు భర్త పాపయ్యశాస్త్రిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు.

బావిలో పడి విద్యార్థి మృతి

ఖాజీపేట : సరదాగా తోటి వారితో ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి.. బావిలో పడి మృతి చెందాడు. పోలీసుల కథ నం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట ఇంటి గ్రేటెడ్ హాస్టల్‌లోని 9 మంది 10వ తరగతి విద్యార్థులు ఆదివారం సెలవు రోజు కావడంతో ఈతకు వెళ్లాలని భావించారు. హాస్టల్ పై నుంచి కిటికీ సన్‌సైడ్ బండ మీదికి దిగారు. అక్కడి నుంచి రక్షణ గోడ పైకి వచ్చి బయటకు దూకేశారు. హాస్టల్ సమీపంలోని చెర్లోపల్లె పొలంలో బావి దగ్గరకు వెళ్లారు. వారిలో ఇద్దరికి మా త్రమే ఈత వస్తుంది. వారితో కలిసి ఈత రాని ఇద్దరు విద్యార్థులు ఈత కొట్టారు. తిరిగి వచ్చేందుకు అందరూ కాళ్లు కడుక్కునేందుకు బావిలోకి దిగారు. వారి లో కార్తీక్ (15) కాళ్లు కడుక్కుంటుండగా.. కాలు జారి బావి లో పడ్డాడు. ఈత రాకపోవడంతో మృతి చెందాడు. మిగతా విద్యార్థులు గట్టిగా కేకలు వేయడంతో.. పొలం, గ్రామంలోని వారు వచ్చి కార్తీక్ మృతదేహాన్ని బయటకు తీశారు. బి.కోడూరు మండలంలోని ఎం.నరసింహ్మపురం గ్రామానికి చెందిన యడవల్లి ప్రసాద్, రత్నమ్మ రెండవ సంతానం కార్తీక్.

విచారణ చేసిన సీఐ

బావి వద్దకు మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రారెడ్డి, ఎస్‌ఐ కుళ్ళాయప్ప చేరుకుని పరిశీలించారు. అనంతరం హాస్టల్‌కు వెళ్లి విద్యార్థులను విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు క్రైం : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ప్రొద్దుటూరు డిపోలో ఆదివారం అసోసియేషన్ రీజినల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ శివారెడ్డి, రీజినల్ చైర్మన్ పి.రామిరెడ్డి, కార్యదర్శి పి.సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీజినల్ వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

అగ్నికి అరటి తోటలు ఆహుతి

ఓబులవారిపల్లె : మండలంలోని అయ్యలరాజుపల్లి, పున్నాటివారిపల్లె గ్రామాల సమీపంలో వ్యవసాయ భూముల వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు కంచెకు నిప్పు అంటించడంతో అరటి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. కంచెలో చెలరేగిన మంటలు స్వల్ప వ్యవధిలోనే పండ్ల తోటలకు వ్యాపించడంతో 18 ఎకరాలలోని అరటితోట అగ్నికి ఆహుతయ్యింది. అగ్నికి తోడు గాలులు వీచడంతో మంటలు త్వరగా వ్యాపించి అపారనష్టం వాటిల్లింది. అయ్యలరాజుపల్లిలోని జి.చెంగమ్మకు చెందిన 5 ఎకరాలు, జి.మధుసూదన్‌కు చెందిన 3, జి.సుబ్బరాయుడుకు చెందిన 6, దాసరి లక్ష్మీనరసమ్మకు చెందిన 4 ఎకరాల అరటి తోటలు కాలిపోయాయి. నాలుగు బోర్లు, నాలుగు స్టార్టర్లు, రూ. 10 లక్షల విలువైన డ్రిప్ పరికరాలు దెబ్బతిన్నాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు.


ఓబులవారిపల్లె : మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


కేవీపల్లె : మంటల్లో కాలిపోతున్న గడ్డివాములు

గడ్డివాములకు నిప్పు

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె పంచాయతీ శెట్టిపల్లెవారిపల్లెలో గడ్డివాములు కాలిపోవడంతో రూ.1.20 లక్షల నష్టం వాటిల్లింది. వివరాలిలా వున్నాయి. శెట్టిపల్లెవారిపల్లెకు చెందిన రైతులు యల్లారెడ్డి, సిద్ధారెడ్డి, చిన్నయ్యరామరెడ్డి, మల్‌రెడ్డి తమ పశువులకు పశుగ్రాసం కోసం గ్రామ సమీపంలో రెండు వరిగడ్డి వాములు, రెండు శనగపొట్టు వాములు, మూడు ఉలవపొట్టు వాములు వేసుకున్నారు. వాటికి గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి 10.30 గంటలకు నిప్పు పెట్టారు. గమనించిన గ్రామస్తులు పీలేరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలు అదుపు చేసి వెళ్లిపోయారు. అయితే మరోసారి ఆదివారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో వాములకు నిప్పుపెట్టారు. దీంతో మొత్తం ఏడు వాములకు మంటలు వ్యాపించాయి. మరోసారి సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి అదుపు చేశారు. అయితే అప్పటికే మొత్తం వాములు కాలిబూడిదయ్యాయి. రూ. 1.20 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. వారు కేవీపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలిపోయిన నన్నారి, ఉలవ పంటలు

సంబేపల్లె : మండల పరిధి దుద్యాల పంచాయతీలోని నన్నారి, ఉలవ పంటలు ఆదివారం అగ్ని ప్రమాదానికి ఆహుతయ్యాయి. పెద్దకోడివాండ్లపల్లెలోని మోహన్‌రెడ్డి సాగు చేసిన మూడు ఎకరాలు నన్నారి, అంకంవాండ్లపల్లెలోని రామాంజులరెడ్డికి చెందిన 5 ఎకరాలలోని ఉలవ పంటలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆరిప్రేశారు. పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడంతో లక్షల రూపాయలు నష్టపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పొలాల సమీపంలో ఉన్న సోలార్‌ప్లాంట్‌కు చెందిన వారే ఈ అగ్ని ప్రమాదానికి కారణమని వారు వాపోతున్నారు. ఈ మేరకు సంబేపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దుఃఖం ఒక్కటే మిగిలింది!

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థుల దుర్మరణం
- ముగ్గురూ ఏకైక కుమారులే
- ఆస్పత్రి వద్ద మిన్నంటిన రోదనలు

'చిన్నప్పటి నుంచి గారాబంగా పెంచాం. కష్టాన్ని నమ్ముకుని కడుపులో పెట్టుకుని చూసుకున్నాం. చదువుల్లో రాణిస్తున్నారని పైసా పైసా కూడబెట్టుకుని పెద్ద చదువులు చదివించాలని నిశ్చయించాం. పెద్ద ఉద్యోగం చేసి మా పేరు నిలబెడతారని కలలుగన్నాం. చరమాంకంలో తోడుగా నిలుస్తున్నారని ఆశలు పెంచుకున్నాం. మిమ్మల్నే తలుచుకుని జీవితాలు నెట్టుకొస్తున్నాం. ఇంతలోనే మమ్మల్నందర్నీ వదిలి అనంతలోకాలకు వెళ్లిపోయారా నాయనా.. మేమెట్టా బతికేది తండ్రీ' అంటూ రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారులను పోగొట్టుకున్న తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. కుప్పం-పలమనేరు రహదారిలో ఆదివారం వేకువ జాము జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు విగతజీవులు కావడం తీవ్ర విషాదాన్ని నింపింది.

గుడుపల్లె (చిత్తూరు జిల్లా): ఉన్నత చదువులు పూర్తయి త్వరలోనే ఉద్యోగాలు అందుకోవాలనున్న వారి ఆశలను విధి తుంచేసింది. చదువుల్లో రాణిస్తూ సమాజంలో ఉన్నతంగా రాణిస్తారని కలలుగన్న తల్లిదండ్రుల కలలను చిదిమేసింది. చిత్తూరు జిల్లాలోని కుప్పం- పలమనేరు జాతీయ రహదారిలో ఆదివారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం విషాదాన్ని నింపింది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పెనుబర్తి గ్రామానికి చెందిన సుచింద్రారెడ్డి కుమారుడు శ్రీవికాస్‌రెడ్డి(21), అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన సుబ్బరాయుడు కుమారుడు ప్రవీణ్(24) కుప్పం పీఈఎస్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతుండగా.. రాజంపేటకు చెందిన రమణయ్య కుమారుడు కల్యాణ్(20) మదనపల్లె మిట్స్ కళాశాలలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వీరు ముగ్గురూ మంచి స్నేహితులు. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కుమారులు కావడంతో అల్లారుముద్దుగా పెంచారు. శనివారం సాయంత్రం మదనపల్లె నుంచి కుప్పం పీఈఎస్‌కు వచ్చిన కల్యాణ్.. ఆదివారం వేకువ జామున 3 గంటల సమయంలో తన స్నేహితుని కారు తీసుకుని శ్రీవికాస్‌రెడ్డి, ప్రవీణ్‌తో కలిసి కుప్పానికి బయలుదేరారు. మార్గంమధ్యలో కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం చిన్నశెట్టిపల్లె వద్ద ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. గుడుపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కారు ఢీకొని దెబ్బతిన్న లారీ ముందుభాగం


ప్రమాదంలో ధ్వంసమైన కారు

కన్నీరుమున్నీరు

తల్లిదండ్రులు కుప్పం ఆస్పత్రికి చేరుకుని విగత జీవులుగా పడి ఉన్న తమ బిడ్డలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించడం కలచివేసింది. తమపై ఎన్నో ఆశలు పెంచుకున్నామని, ఉన్నత చదువులు చదివి తమను ఉన్నతంగా చూసుకుంటారని ఆశపడ్డామని, ఇంతలో తమ ఆశలు తుంచేసి వెళ్లిపోయారా నాయనా అంటూ గుండెలవిసేలా రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది.


కుప్పం ఏరియా ఆస్పత్రి వద్ద విలపిస్తున్న మృతుల తల్లిదండ్రులు